ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 13-01-2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఉత్తర్ప్రదేశ్లోని ప్రయాగ్రాజ్ లో ఈ రోజు తెల్లవారు జామున మహా కుంభమేళా ఘనంగా ప్రారంభమైంది. త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు దేశ విదేశీ భక్తులు పోటెత్తారు.

2. ప్రయాగ్‌రాజ్‌లో ప్రారంభమైన మహా కుంభమేళా భారత దేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

3. తెలుగు రాష్ట్రాల్లో భోగి పండగను ఘనంగా జరుపుకుంటున్నారు. పలు నగరాల్లో భోగి మంటలు, రంగవల్లులతో వీధులు కళకళలాడుతున్నాయి.

4. ఈనెల 26 నుండి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు , రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించబోతున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.

**MAHA KUMBH MELA**

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకగా పేరొందిన ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ లో మహా కుంభమేళా ఘనంగా ప్రారంభమైంది. గంగా , యమునా, సరస్వతీ నదులు కలిసే ప్రదేశమైన ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పోటెత్తారు.

తెల్లవారుజాము నుంచే లక్షలాది మంది భక్తులు త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. వేడుకలు  ఫిబ్రవరి 26 వరకు  జరగనున్నాయి. త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించడానికి  దేశ విదేశాల నుంచి సుమారు   45 కోట్ల మంది భక్తులు  వస్తారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తున్నది. పుణ్య స్నానాలు ఆచరించడానికి  సాధువులు లక్షలాదిగా తరలివస్తున్నారని పేర్కొంది. ఇక  ఈ రోజు  ఉదయం 8 గంటల వరకు సుమారు 40 లక్షల మందికిపైగా భక్తులు త్రివేణి సంగమంలో షాహీ స్నాన్ చేసినట్లు  అధికారులు తెలియచేశారు.

శంకర్

**PM MODI**

కుంభమేళా ప్రారంభంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ  ఎక్స్ వేదికగా స్పందించారు. భారతీయ విలువలు  ,  సంస్కృతిని గౌరవించే కోట్లాది మందికి ఇది చాలా ప్రత్యేకమైన రోజని అన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో ప్రారంభమైన మహా కుంభమేళా భక్తి , విశ్వాసం, సంప్రదాయాల సంగమంతో ఎంతోమందిని ఒకచోట చేర్చు తుందన్నారు. భారత దేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఈ వేడుక ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. పవిత్ర స్నానాలు ఆచరించి, భగవంతుడి ఆశీస్సులు తీసుకునేందుకు  అసంఖ్యాంక ప్రజలు రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

ఎన్ఎస్డి

**PM - TUNNEL**

ప్రధానమంత్రి  నరేంద్ర మోదీ ఇవాళ జమ్ము   కశ్మీర్ లోని సోన్‌మార్గ్  ప్రాంతంలో జడ్ మోడ్ సొరంగాన్ని  ప్రారంభించారు. టన్నెల్ ప్రారంభోత్సవంలో జమ్ముకశ్మీర్

ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తదితరులు పాల్గొన్నారు. శ్రీనగర్ నుంచి కార్గిల్ వెళ్లే దారిలో శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారి లో ఈ సొరంగాన్ని నిర్మించారు. ఈ టన్నెల్ నిర్మాణం కోసం ఏకంగా 2,500 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఈ జడ్ మోడ్ సొరంగం 6.5 కిలోమీటర్ల పొడవు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ టన్నెల్ ద్వారా ఏ సీజన్‌లోనైనా లడఖ్‌కు చేరుకోవడానికి వీలవుతుందని పేర్కొన్నారు.

**(NSD)**

**SANKRANTHI**

తెలుగు రాష్ట్రాల్లో భోగి పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు. పిల్లలు , పెద్దలు ఉదయాన్నే వీధుల్లో భోగి మంటలు వేశారు. మహిళలు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. మరోవైపు ఈ రోజు పుష్య పౌర్ణమి కూడా కావడంతో ఉదయాన్నే భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సంక్రాంతి కోసం నగరవాసులు స్వగ్రామాలకు రావడంతో తెలంగాణ పల్లెల్లో సంక్రాంతి సందడి నెలకొంది. హరిదాసులతో పాటు అలంకరించిన బసవన్నలు ఇంటింటికీ వెళ్తున్నాయి. పలువురు ప్రజా ప్రతినిధులు తమ నియోజక వర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన భోగి మంటల కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి , చంద్రబాబునాయుడు వేర్వేరు ప్రకటనల్లో ప్రజలకు సంక్రాంతి శుభా కాంక్షలు తెలియచేశారు. అందరి కుటుంబాల్లో సంక్రాంతి కొత్త వెలుగులు తీసుకురావాలని

ఆకాంక్షించారు. ఆంధ్ర ప్రదేశ్ లో సంక్రాంతి సందడి అత్యంత కోలాహలంగా కొనసాగుతోంది.

శంకర్

**PONGULETI**

రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నాలుగు సంక్షేమ కార్యక్రమాలను జనవరి 26 నుంచి అమలు చేయబోతున్నట్టు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో జరిగిన భోగి పండుగ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడత నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం ఉన్నంత కాలం పేదవారికి ఇళ్లు ఇచ్చే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేస్తామని తెలిపారు. సాగు భూములన్నింటికీ రైతు భరోసాను వర్తింపచేయడం జరుగుతుందని వెల్లడించారు.
(పిటీసీ)

**SITHAKKA - ASIFABAD VISIT**

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చేపట్టిన ఆసీఫాబాద్ జిల్లా పర్యటన రెండవ రోజు కొనసాగుతుంది. ఈరోజు ఉదయం రెబ్బెన మండలం గోలేటి గ్రామం నుండి మంత్రి పర్యటన ప్రారంభమైంది. గంగాపూర్ ఆలయ ఆర్చ్ గేట్ కు మంత్రి శంకుస్థాపన చేశారు. కొత్తగా నిర్మించిన అంగన్వాడి

భవనాన్ని ప్రారంభించారు. బాలసదన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.
(పిటీసీ)

**PONNAM PRABHAKAR**

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈరోజు ఆయన వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి మీడియాతో మాట్లాడారు. దాదాపు 77 కోట్ల రూపాయల వ్యయంతో భక్తుల సౌకర్యాలను మెరుగు పర్చడానికి చర్యలు చేపట్టామని వివరించారు. మహా శివరాత్రి ఏర్పాట్లపై కూడా సమీక్షా జరిపామన్నారు. తిరుమల , శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి వేములవాడకు వచ్చే భక్తులకు కూడా మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**సౌండ్ బైట్ ... పొన్నం ప్రభాకర్**

(పిటీసీ)

**KCR**

ఉమ్మడి రాష్ట్రంలో దండుగన్న తెలంగాణ వ్యవసాయం , బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పండుగలా మారిందని మాజీ ముఖ్యమంత్రి , బీఆర్ ఎస్ అధినేత చంద్రశేఖరరావు అన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేసే

సందేశంలో ఆయన ఈ విషయం గుర్తు చేశారు. రైతుల జీవితాల్లో వెలుగులు కొనసాగాలని ఆకాంక్షించారు. తమ పదేళ్ల పాలనలో వ్యవసాయానికి , రైతు సంక్షేమానికి దాదాపు 4.5 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. రాజకీయాలకు అతీతంగా రాజీ పడకుండా గత పదేళ్ల ప్రగతి ప్రస్థానాన్ని నేటి ప్రభుత్వం కొనసాగించాలని సూచించారు.

పిఎన్

**KAUSHIK REDDY**

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో మూడు కేసులు నమోదయ్యాయి. జగిత్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పై దురుసుగా ప్రవర్తించారంటూ అయన పీఏ ఇచ్చిన ఫిర్యాదుతో పాటుగా , జిల్లా కలక్టరేట్ లో అధికారిక సమావేశంలో గందరగోళం సృష్టించి, సమవేశాన్ని పక్కదారి పట్టించారని కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**పిటిసి, కరీంనగర్**

**KITE FESTIVAL 2025**

నేటి నుండి మూడు రోజుల పాటు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో పతంగుల పండగ జరగనుందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ వేడుకలకు 16 దేశాల నుండి 47 మంది కైట్ ప్లేయర్లు , 14 రాష్ట్రాల నుండి కైట్ క్లబ్ సభ్యులు హజరు కానున్నారన్నారు. దీంతో పాటు మిఠాయి ఉత్సవాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ , అంతర్జాతీయ మిఠాయిలను, తెలంగాణ పిండి వంటలను ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసే స్టాళ్లలో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు.

శంకర్

**BIRD FESTIVAL - MANCHIRYALA**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో నిర్వహించిన బర్డ్ వాచ్ ఫెస్టివల్ విజయవంతమైందని జన్నారం ఇన్చార్జి రేంజి ఫారెస్ట్ అధికారిణి సుష్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా నుంచే కాకుండా తెలంగాణ లోని పలుచోట్ల నుండి వచ్చిన పక్షి ప్రేమికులు బర్డ్ వాచ్ కార్యక్రమంలో పాల్గొనట్లు తెలిపారు. వివిధ రకాల పక్షులు కైసన్ కుంట వద్దకు తరలి రావడంతో పక్షి ప్రేమికులు తమ కెమెరాల్లో బంధించారు.

(పిటీసీ)

**MANDA JAGANNADHAM**

మాజీ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మందా జగన్నాథం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన నాగర్ కర్నూల్ పార్లమెంటు స్థానం నుంచి నాలుగు సార్లు గెలిచి ఎంపీగా ప్రజలకు సేవ చేశారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంతిమ సంస్కారాలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

( ప్రెస్ నోట్)